సాక్షి
విజయనగరం
ఆదివారం । 17 । సెప్టెంబర్ । 2023



చిట్టి చేతుల్లో మట్టి గణపతి

చిన్నారులు తమ సృజనకు పదునుపెట్టారు. చిట్టిచేతులతో మట్టి గణపతి ప్రతిమలను రూపొందించి మురిసిపోయారు. - 8లో



పెదఖండేపల్లి రోడ్డుకు రూ.2కోట్లు మంజూరు

పెదఖండేపల్లి గ్రామస్తుల రోడ్డు కష్టాలు కొద్దిరోజుల్లో తొలగనున్నాయి. - 8లో



20 నుంచి ఉక్కు రక్షణ యాత్ర

విశాఖ స్టీల్‌ప్లాంట్ రక్షణ కోసం ఈ నెల 20 నుంచి 25 వరకు ఉక్కు రక్షణ యాత్రను సీపీఎం తలపెట్టింది. - 8లో

న్యూస్‌రీల్

ముఖ్యమంత్రి కృషి భేష్



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న భీశెట్టి బాబ్జి

విజయనగరం ఫూల్‌బాగ్: విజయనగరం జిల్లాకు ప్రభుత్వ వైద్య కళాశాలను మంజూరు చేసి, ప్రారంభించిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి లోక్ సత్తాపార్టీ తరఫున ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జి అభినందనలు తెలిపారు. పార్టీ కార్యాలయంలో విలేకరులతో శనివారం ఆయన మాట్లాడారు. గాజులరేగ ప్రాంతంలో 70 ఎకరాల్లో రూ.500 కోట్ల అంచనా వ్యయంతో కళాశాల నిర్మాణాన్ని తలపెట్టడం అభినందనీయమన్నారు. 13,99,879 చదరపు అడుగులకు తొలిదశలో 1,50,000 చదరపు అడుగుల్లో రూ.99 కోట్ల వ్యయంతో నిర్మించిన వైద్య కళాశాలను ప్రారంభించడం శుభ పరిణామమన్నారు. ముఖ్యమంత్రి కృషిని అభినందించాల్సిందేనన్నారు. 1979లో ఏర్పడిన జిల్లాకు ఇప్పటివరకు ప్రభుత్వ వైద్యకళాశాల లేని లోటును జగన్‌మోహన్‌రెడ్డి తీర్చారన్నారు. సమావేశంలో పార్టీ నాయకులు అల్లంశెట్టి నాగభూషణం, తాత్రాజు రాజారావు, పి.ఎల్.ఎన్.రాజు, భీంపల్లి భాస్కర్, ఇ.గోపి పాల్గొన్నారు.

21న జిల్లా స్థాయి యువజనోత్సవాలు

- సెట్విజ్ సీఈఓ బి.రామ్‌గోపాల్

విజయనగరం: యువతలో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు ఏటా నిర్వహించే యువజనోత్సవాలను ఈ నెల 21న గాజులరేగలోని సీతం ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహిస్తామని సెట్విజ్ సీఈఓ బి.రామ్‌గోపాల్ శనివారం తెలిపారు. ఆ రోజు ఉదయం 9 గంటల నుంచి ఉత్సవాలు ప్రారంభమవుతాయన్నారు. సాంస్కృతిక విభాగంలో జానపద నృత్యాలు, జానపద గీతాల పోటీలు, జీవిత నైపుణ్య విభాగంలో స్టోరీ రైటింగ్, పోస్టర్ మేకింగ్, డిక్లమేషన్, ఫొటోగ్రఫీ అంశాల్లో యువత తమ ప్రతిభను నిరూపించుకోవాలన్నారు. పోటీల్లో పాల్గొనేందుకు 15 నుంచి 29 సంవత్సరాల మధ్య వయసున్న యువతీ యువకులు అర్హులని తెలిపారు. ఉత్సవాల్లో ప్రథమ స్థానం సాధించిన వారిని రాష్ట్ర స్థాయి ఉత్సవాలకు ఎంపిక చేస్తామన్నారు. రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ప్రతిభకనబరిచిన వారికి జాతీయ యువజనోత్సవాలకు ఎంపిక చేస్తారన్నారు. ఉత్సవాల్లో పాల్గొనేవారు ఈ నెల 20వ తేదీలోగా సెల్: 98491 99384, 82475 54334 నంబర్లను సంప్రదించాలని సూచించారు.


పైడితల్లి హుండీల ఆదాయం లెక్కింపు



హుండీల ఆదాయం లెక్కింపును పర్యవేక్షిస్తున్న ఆలయ ఈఓ సుధారాణి, ట్రస్ట్ బోర్డు సభ్యులు

విజయనగరం టౌన్: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం పైడితల్లి అమ్మవారు చదురుగుడిలోని హుండీల ఆదాయన్ని శివాలయం వీధిలో ఉన్న అమ్మవారి కళ్యాణమండపంలో శనివారం లెక్కించారు. రూ.12,14,093ల నగదు, 15 గ్రాముల 800 మిల్లీ గ్రాముల బంగారం, 242 గ్రాముల వెండి లభించినట్లు ఆలయ ఈఓ కె.ఎల్.సుధారాణి తెలిపారు. కార్యక్రమంలో ట్రస్టు బోర్డు సభ్యులు గంధం లావణ్య, నక్కా జ్యోతి, బలివాడ పార్వతి, తదితరులు పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం



రూ.లక్ష విరాళాన్ని స్వీకరిస్తున్న ఆలయ సూపర్ వైజర్ ఏడుకొండలు

పైడితల్లి అమ్మవారి నిత్యాన్నదానానికి విజయవాడకు చెందిన జగన్‌మోహన్ రూ.లక్ష విరాళాన్ని ఆలయ సూపర్‌వైజర్ ఏడుకొండలకు శనివారం అందజేశారు. తన భార్య సుభాషిణి పేరుతో అమ్మవారి ఆలయంలో అన్నదానం చేయాలని కోరారు. ఆయనకు వేదపండితులు వేదాశీస్సులు, ప్రసాదాన్ని అందజేశారు.

■ చవితి మార్కెట్



గణపతి పూజాసామగ్రి కొనుగోలుదారులతో జిల్లాలోని మార్కెట్లన్నీ శనివారం రద్దీగా మారాయి. విజయనగరంలోని గంటస్తంభం, కన్యకాపరమేశ్వరి ఆలయం నుంచి మూడలాంతర్ల కూడలి వరకు ఎటుచూసినా జనమే కనిపించారు. వినాయక పూజకు కావాల్సిన ప్రతిమలు, ఫలాలు, అలంకరణ సామగ్రిని కొనుగోలు చేశారు. వ్యాపారులు పూజాసామగ్రి ధరలను అమాంతం పెంచేశారు. కిలో జామకాయలు రూ.100, ద్రాక్ష రూ.250పైన పలికాయి. దేవుని పూజకు కావాల్సిన పాలవెల్లి రూ.40 నుంచి రూ.60కు విక్రయించారు. టెంకాయలు, అరటిపండ్ల ధరలనూ పెంచేశారు.

– విజయనగరం టౌన్

5,905 మందికి వైఎస్సార్ కాపునేస్తం



వైఎస్సార్ కాపునేస్తం నమూనా చెక్కును లబ్ధిదారులకు అందజేస్తున్న జిల్లా ఇన్‌చార్జి మంత్రి, డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, అధికారులు

- రూ.8.85 కోట్ల మేర ఆర్థిక ప్రయోజనం
- లబ్ధిదారులకు నమూనా చెక్కును అందజేసిన మంత్రి, జెడ్పీ చైర్మన్

విజయనగరం అర్బన్: వైఎస్సార్ కాపునేస్తం పథకం కింద జిల్లాకు చెందిన కాపు, తెలగ, ఒంటరి, బలిజ కులాలకు చెందిన 5,905 మంది మహిళలకు రూ.8.85 కోట్ల ఆర్థిక ప్రయోజనం కలిగిందని జిల్లా ఇన్‌చార్జి మంత్రి, ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు అన్నారు. వైఎస్సార్ కాపునేస్తం పథకం నాలుగో ఏడాది నిధులను ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి నిడదవోలు వేదికగా శనివారం విడుదల చేశారు. బటన్ నొక్కి లబ్ధిదారుల ఖాతాల్లో నిధులను జమ చేశారు. ముఖ్యమంత్రి కార్యక్రమం అనంతరం జిల్లా నుంచి లబ్ధిపొందిన మహిళలకు రూ.8,85,75,000లు విలువ గల మెగా చెక్కును జిల్లా ఇన్‌చార్జి మంత్రి బూడి ముత్యాలనాయుడు, జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అందజేశారు. కార్యక్రమంలో ఎస్.కోట ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు, జాయింట్ కలెక్టర్ కె.మయూర్‌అశోక్, డీఆర్వో ఎస్.డి.అనిత, బీసీ కార్పొరేషన్ ఈడీ పెంటోజీరావు, కాపు కార్పొరేషన్ డైరెక్టర్లు పాల్గొన్నారు.

మహిళలకు ఆర్థిక భరోసా

వైఎస్సార్ కాపునేస్తం కింద మహిళలకు రూ.15వేలు చొప్పున నాలుగేళ్లుగా అందజేయడం ఆనందదాయకం. తెలగ సామాజిక వర్గ మహిళలకు ఆర్థిక భరోసా కలిగింది. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం చేస్తున్న ఆర్థిక మేలు మర్చిపోలేనిది.

– చనమల్ల ప్రసాదరావు, తెలగ వెల్ఫేర్ అసోసియేషన్ ఉత్తరాంధ్ర చైర్మన్

ప్రగతిపథంలో ఎస్.కోట



సమావేశంలో మాట్లాడుతున్న ఉప ముఖ్యమంత్రి ముత్యాలనాయుడు

- పూర్తిచేసిన పనులకు వెంటనే బిల్లుల చెల్లింపు
- త్వరితగతిన ఈ–క్రాప్ నమోదు
- సీజనల్ వ్యాధుల కట్టడిపై ప్రత్యేక శ్రద్ధ అవసరం
- సచివాలయాలు, విలేజ్ క్లినిక్స్ నిర్మాణంపై దృష్టి సారించండి
- జగనన్న ఆరోగ్య సురక్షతో ప్రజలకు వైద్యభరోసా
- జిల్లా ఇన్‌చార్జి మంత్రి బూడి ముత్యాలనాయుడు
- ఎస్.కోట నియోజకవర్గ అభివృద్ధిపై సమీక్ష



సమావేశానికి హాజరైన ప్రజాప్రతినిధులు, అధికారులు

విజయనగరం ఫోర్ట్: ఎస్.కోట నియోజకవర్గం ప్రగతిపథంలో పయనిస్తోందని, మరింత అభివృద్ధికి సమన్వయంతో ముందుకు సాగుదామని డిప్యూటీ సీఎం, జిల్లా ఇన్‌చార్జి మంత్రి బూడి ముత్యాలనాయుడు పిలుపునిచ్చారు. విపత్తుల సమయంలో రైతులను ఆదుకునేందుకు, పంటలు అమ్ముకునేందుకు దోహదపడే ఈ క్రాప్ నమోదును వేగవంతం చేయాలని వ్యవసాయ అధికారులకు సూచించారు. కలెక్టరేట్ ఆడిటోరియంలో ఎస్.కోట నియోజకవర్గ అభివృద్ధిపై శనివారం సమీక్షించారు.వ్యవసాయం, నీటి పారుదల, వైద్యం,ఆరోగ్యం, గృహనిర్మాణం, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్, విద్యుత్, డ్వామా, ఆర్అండ్‌బీ, విద్య తదితర శాఖల పురోగతిపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీఒక్కరి ఆరోగ్యానికి భరోసా కల్పించేందుకు ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని తెలిపారు. దీనిని విజయవంతం చేయాలని ఆరోగ్యశాఖ అధికారులను కోరారు. ఇంటింటికీ వెళ్లి వైద్యపరీక్షలు నిర్వహించడంతో పాటు అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేయాలన్నారు. డెంగీ, మలేరియా తదితర సీజనల్ వ్యాధుల నివారణపై దృష్టి సారించాలన్నారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా మంజూరైన పనులను వెంటనే ప్రారంభించి పూర్తి చేయాలన్నారు. విద్యుత్ పనులన్నింటినీ సివిల్ వర్క్సగా మార్పు చేయాలని సూచించారు. పూర్తిచేసిన పనులకు ప్రభుత్వం వెంటనే బిల్లులు చెల్లిస్తోందన్నారు. ప్రాధాన్యత, ప్రాధాన్యేతర పనులన్నీ బిల్లులు అప్‌లోడ్ చేయాలని తెలిపారు. రైతు భరోసా కేంద్రాలు, సచివాలయాలు, వైఎస్సార్ విలేజ్‌క్లినిక్స్ భవనాలను అక్టోబర్ నెలఖారు నాటికి పూర్తి చేయాలన్నారు. వెల్‌నెస్ కేంద్రాల నిర్వహణపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. వర్షపాతం కొరత కారణంగా పంటలుపూర్తిగా వేయలేని చోట ప్రత్యామ్నాయ పంటలను వేసేందుకు ప్రణాళిక సిద్ధం చేయాలని చెప్పారు.

- జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు మాట్లాడుతూ సొంత స్థలాలు ఉండి ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్న వారికి త్వరలోనే ఇళ్లు మంజూరు చేస్తామని చెప్పారు. దీనికోసం అర్హుల జాబితాను సిద్ధం చేయాలన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎస్.కోట మీదుగా నిర్మితమవుతున్న జాతీయరహదారులతో నియోజకవర్గం వేగవంతంగా అభివృద్ధి చెందుతోందన్నారు.
- ఎస్.కోట ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ జల్‌జీవన్ మిషన్ కింద ఆర్‌డబ్ల్యూఎస్ ద్వారా రూ.1.70 కోట్ల పనులు పూర్తి చేయగా, ఇప్పటివరకు రూ.17లక్షలు బిల్లులు విడుదలయ్యాయన్నారు. కొత్తవలస ప్రధాన కూడలిలో రోడ్లను బాగుచేయాల్సి ఉందన్నారు. గడపగడప మన ప్రభుత్వం కార్యక్రమంలో 7వేల మంది ఇళ్లకోసం దరఖాస్తులు అందజేశారని, వీరిలో 4 వేల మంది సొంత స్థలం ఉన్నావారు, మరో 3వేల మంది స్థలాలు లేనివారని తెలిపారు. స్థలాలు లేనివారికి ఇళ్లపట్టాల భూమి కొనుగోలుకు అవసరమైన నిధులకోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాలన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, డీసీసీబీ చైర్మన్ వేచలపు చినరామునాయుడు, ఎస్.కోట నియోజకవర్గంలోని వివిధ మండలాల జెడ్పీటీసీలు, ఎంపీపీలు, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

పది పరీక్ష ఫీజు గడువు పెంపు

విజయనగరం అర్బన్: పదో తరగతి ఫెయిలై ప్రైవేటుగా పరీక్షలు రాయనున్న, మైగ్రేషన్ సర్టిఫికెట్ కావాలన్న విద్యార్థులకు ఫీజు గడువును పొడిగించినట్టు డీఈఓ బి.లింగేశ్వరరెడ్డి తెలిపారు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. తాజా షెడ్యూల్ ప్రకారం ప్రధానోపాధ్యాయుడి స్థాయిలో ఫీజు చెల్లించడానికి ఈ నెల 30 వరకు అవకాశం ఉందని పేర్కొన్నారు. అదే తేదీలోగా నామినల్ రోల్స్, ఇతర డాక్యుమెంట్స్ ఆన్‌లైన్‌లో సమర్పించాలని తెలిపారు. వచ్చే నెల 1 నుంచి 5వ తేదీ వరకు రూ.50, డిసెంబర్ 6 నుంచి 11వ తేదీ వరకు రూ.100, 12 నుంచి 16 తేదీ వరకు రూ.500 అపరాధ రుసుంతో ఫీజు చెల్లించవచ్చని సూచించారు. ఒక సబ్జెక్టు పరీక్షకు అయితే రూ.110, మూడు సబ్జెక్టులు కన్నా ఎక్కువ రాసిన వారు రూ.125, మైగ్రేషన్ సర్టిఫికెట్ ఫీజు రూ.80 చెల్లించాలని పేర్కొన్నారు. ఫీజును 'బీఎస్ఈ.ఏపీ.జీఓవీ.ఐఎన్' వెబ్‌సైట్‌లో స్కూల్ లాగిన్‌లో మాత్రమే చెల్లించాలని తెలిపారు. సీఎఫ్ఎంఎస్‌లో బ్యాంకు చలానాలు అనుమతి లేదని ప్రధానోపాధ్యాయులకు ఆయన తెలియజేశారు.

ఏకాగ్రతతోనే వృత్తిలో రాణింపు



సమావేశంలో మాట్లాడుతున్న జస్టిస్ రామకృష్ణప్రసాద్

- హైకోర్టు జడ్జి జస్టిస్ రామకృష్ణ ప్రసాద్

సాక్షి ప్రతినిధి, విజయనగరం: వృత్తిలో ఏకాగ్రతతోనే రాణింపు సాధ్యమని హైకోర్టు జడ్జి జస్టిస్ జి.రామకృష్ణప్రసాద్ జూనియర్లకు హితవు పలికారు. జిల్లా పోర్టుపోలియో జడ్జిగా బాధ్యతలు స్వీకరించిన తరువాత శనివారం మొట్టమొదటిసారిగా ఆయన జిల్లా కోర్టుకు వచ్చారు. ఈ సందర్భంగా న్యాయవాదుల సంఘ ఆహ్వానం మేరకు ఆయన సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. సీనియర్ న్యాయవాదులు కేసుల విచారణ, వాదోపవాదాలు జరుపుతున్నప్పుడు జూనియర్లు అనుసరించాలన్నారు. ఎటువంటి అనుమానాలు ఉన్నా వాటిని ఎప్పటికప్పుడు నివృత్తి చేసుకోవాలని సూచించారు. సీనియర్ న్యాయవాదుల పర్యవేక్షణలో ప్యానల్ ఏర్పాటు చేసి జూనియర్ల సందేహాలు నివృత్తిచేయాలన్నారు. డ్రాఫ్టింగ్‌పైనే కోర్టులో కేసులు ఆధారపడి ఉంటాయన్నారు. సమావేశంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి.కళ్యాణచక్రవర్తి, న్యాయవాదుల సంఘ అధ్యక్ష, ఉపాధ్యక్షులు సీహెచ్ దాము, ఎ.అంజనీకుమార్, కార్యదర్శి వి.జి.సంతోష్, రాష్ట్ర బార్ కౌన్సిల్ మాజీ చైర్మన్ కె.వి.ఎస్.తమ్మన్నశెట్టి, ప్రభుత్వ న్యాయవాది టి.బి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా న్యాయసేవా సదన్‌లో సెమినార్

జిల్లా వ్యాప్తంగా న్యాయమూర్తులకు జిల్లా న్యాయసేవా సదన్‌లో సివిల్ లాపై సెమినార్ నిర్వహించారు. ఈ సెమినార్‌లో రాష్ట్ర హైకోర్టు మాజీ జడ్జి జస్టిస్ ఎం.సీతారామ్మూర్తి, జస్టిస్ రామకృష్ణ ప్రసాద్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి.కళ్యాణ్‌చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ హయాంలో పాఠశాలల నిధుల దోపిడీ!

- ప్రతి పాఠశాలకు స్పీడ్‌మాథ్స్ కిట్లు ఇస్తామని ముందస్తుగా డబ్బులు వసూలు
- ప్రాథమిక పాఠశాలల నుంచి రూ.1650..
- యూపీ, ఉన్నత పాఠశాలల నుంచి రూ.2,250 చొప్పున వసూలు
- ఉత్తరాంధ్రలోని 8,500 పాఠశాలల నుంచి రూ.1.70 కోట్ల వరకు దోపిడీ
- ఏ ఒక్క పాఠశాలకూ పుస్తకాలు అందజేయని వైనం
- 2017లో జరిగిన ఆడిట్‌లో పుస్తకాల కోసం ఖర్చుచేసినట్టు నమోదు

వీరఘట్టం: టీడీపీ నేతల స్కామ్‌లు ఒక్కొక్కటిగా బయటకు వస్తున్నాయి. మాజీ సీఎం చంద్రబాబునాయుడు స్కిల్‌స్కామ్‌లో ప్రజాధనాన్ని లూటీ చేయగా, తామేమీ తక్కువ కాదన్నట్టుగా టీడీపీ నాయకులు కూడా అదే తోవలో నడుస్తూ ప్రజాధనాన్ని కొల్లగొట్టారు. 2016 సంవత్సరంలో అప్పటి విద్యాశాఖ మంత్రి గంటా శ్రీనివాసరావు అనుచరలమంటూ సర్కారుబడుల నిధులు రూ.1.70 కోట్ల వరకు దారిమళ్లించారంటూ కొందరు విద్యాశాఖ అధికారులు బహిరంగంగా చెబుతున్నారు.

పథకం ప్రకారం...

ఏటా ప్రభుత్వం పాఠశాలల నిర్వహణకోసం స్కూల్ గ్రాంట్ విడుదల చేస్తుంది. ఈ నిధులపై కన్నేసిన టీడీపీ ముఠా సభ్యులు పథకం ప్రకారం ప్రతి పాఠశాలకు స్పీడ్ మాథ్స్ కిట్లు ఇస్తామని నమ్మబలికారు. మంత్రి గంటా శ్రీనివాసరావు అనుచరులమని, ఆయన ఆదేశాల మేరకు కరుణ ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూట్ పేరిట బుక్స్ పంపిణీ చేస్తున్నట్టు ఎంఈఓ కార్యాలయాలకు వెళ్లి చెప్పారు. ప్రాథమిక పాఠశాల నుంచి రూ.1650, యూపీ, ఉన్నత పాఠశాలల నుంచి రూ.2,250 చొప్పున వసూలు చేశారు. ఏ ఒక్క పాఠశాలకు పుస్తకాలు పంపిణీ చేయలేదు. 2017లో జరిగిన ఆడిట్‌లో పాఠశాలకు పుస్తకాలు అందినట్టు రికార్డుల్లో



వీరఘట్టంలోని ఓ పాఠశాలకు స్పీడ్ మాథ్స్ కిట్లకు ఇచ్చిన రూ.1650ల రసీదు



స్పీడ్ మాథ్స్ కిట్లు రూ.1650లకు కొనుగోలు చేసినట్టు ఓ పాఠశాల ఆడిట్ బుక్‌లో నమోదైన దృశ్యం

ఖర్చులు నమోదు చేసి, అప్పటి శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం జిల్లాలోని సుమారు 8,500 ప్రభుత్వ పాఠశాలల నుంచి సుమారు రూ.1.70 కోట్లు కాజేశారు. 2016 ఫిబ్రవరి 23న పాఠశాల నిర్వహణ నిధుల ఖర్చులపై పార్వతీపురం మన్యం జిల్లా వీరఘట్టం ఎమ్మార్సీలో ఆడిట్ నిర్వహించారు. స్పీడ్ మాథ్స్ కిట్లు ఇస్తామని డబ్బులు తీసుకుని రసీదులు ఇచ్చారేతప్ప పుస్తకాలు ఇవ్వలేదని పలువురు ప్రధానోపాధ్యాయులు ఆడిట్ అధికారులకు వివరించారు. అయినప్పటికీ హెచ్‌ఎంల మాటలను ఎవరూ లెక్కచేయలేదు. ఆ పుస్తకాలు ఎందుకు ఇవ్వలేదని ఏ ఒక్క ఉన్నతాధికారి ప్రశ్నించలేదు. పాఠశాలలకు పుస్తకాలు ఇవ్వకుండానే అప్పటి విద్యాశాఖ మంత్రి అనుచరులమని చెప్పిన ముఠా నిధులు లూటీచేసినట్టు కొందరు హెచ్‌ఎంలు బహిరంగంగానే చెబుతున్నారు. కరుణ ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూట్ పేరిట కొందరు వ్యక్తులు ఎంఈఓలను కలవడం, అన్ని పాఠశాలలకు సంబందించిన క్యాష్ రసీదులు అందజేసి డబ్బులు వసూలు చేశారని వాపోతున్నారు. మంత్రి పేరు చెప్పడంతో మండల విద్యాశాఖ అధికారులు నోరు మెదపలేకపోయారని వివరిస్తున్నారు. విచారణ జరిపితే పాఠశాలల నిధుల దోపిడీ వ్యవహారం బయటకు వస్తుందంటున్నారు.

క్లుప్తంగా

లారీ ఢీకొని వ్యక్తి దుర్మరణం



ఆస్పత్రిలో మృతి చెందిన రాము

మెంటాడ(గజపతినగరం రూరల్): మండలంలోని మరుపల్లి గ్రామ సమీపంలో జాతీయ రహదారిపై శనివారం పార్వతీపురం నుండి విశాఖ వైపు వెళ్తున్న లారీ ఢీకొని కోంద్రు రాము అనే వ్యక్తి మృతి చెందాడని హెచ్‌సీ సత్యనారాయణ తెలిపారు. కోంద్రు రాము మెరకముడిదాం మండలం మర్రివలస గ్రామానికి చెందిన వాడని, మరుపల్లి గ్రామంలోని తన కుమార్తె ఇంటికి వచ్చిన ఆయన రహదారి దాటుతుండగా లారీ ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడని పేర్కొన్నారు. 108లో స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి, చికిత్స పొందుతుండగా మరణించినట్లు తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు చెప్పారు.

పశువుల శాల దగ్ధం



కాలిన గాయాలతో ఆవు దూడలు

భామిని: మండలంలోని తాటిమానుగూడలో బిడ్డిక ఈశ్వరరావుకు చెందిన పశువుల పాకలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో రేగిన మంటలకు శాల కాలిపోయింది. ప్రమాదంలో ఒక మేక మృతి చెందింది. మరో 12 మేకలు తీవ్రంగా గాయపడ్డాయి. వీటిని రక్షించబోయి ఆదివాసీ మహిళ ఆరిక గౌరి గాయపడింది. శాలలో ఉన్న పాడి ఆవు, దూడలకు కూడా గాయాలయ్యాయి. వీఆర్‌ఓ రవికుమార్ ప్రమాద విషయం తెలుసుకొని నష్టాలు గుర్తించి అధికారులకు తెలిపారు. సంచార పశువైద్యశాలను రప్పించి గాయపడిన జీవాలకు వైద్యం చేయించారు. గౌరీని బాలేరు పీహెచ్‌సీకి చికిత్స నిమిత్తం తీసుకువెళ్లారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత



పీడీఎస్ బియ్యం స్వాధీనం చేసుకున్న సీఎస్‌డీటీ మూర్తి

శృంగవరపుకోట: పీడీఎస్ బియ్యం అక్రమంగా నిల్వ చేస్తున్నారన్న సమాచారంతో మండల సివిల్ సప్లయ్ డిప్యూటీ తహసీల్దార్ ఎన్.వి.వి.ఎస్.మూర్తి రెండు దుకాణాల యజమానులపై శనివారం కేసులు నమోదు చేశారు. మండలంలో సంతగవిరమ్మపేట గ్రామంలో కిరాణా వ్యాపారులు మద్దుల శ్రీరామ్మూర్తి దుకాణం తనిఖీ చేయగా 177కిలోల పీడీఎస్ బియ్యం, అదే గ్రామానికి చెందిన కల్లూరి హరి దుకాణంలో 96కిలోల బియ్యం ఉన్నట్టు గుర్తించామన్నారు. దీంతో వారిరువురిపై 6ఏ కేసులు నమోదు చేసి జిల్లా ఉన్నతాధికారులకు నివేదికలు పంపినట్టు చెప్పారు.

వాహనం ఢీకొని వ్యక్తి దుర్మరణం



శ్రీను మృతదేహం

రాజాం సిటీ: గుర్తు తెలియని వాహనం ఢీకొని బండి శ్రీను(48) అనే వ్యక్తి దుర్మరణం చెందిన ఘటన స్థానిక బొబ్బిలి రోడ్డులోని గ్యాస్ కార్యాలయం సమీపంలో శనివారం రాత్రి జరిగింది. పెనుబాక గ్రామానికి చెందిన ఆయన స్థానిక బొబ్బిలి రోడ్డులోని ఓ జ్యూట్ ఫ్యాక్టరీలో ఎలక్ట్రీషియన్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ఎప్పటిలాగే శనివారం విధులకు నడుచుకుంటూ ఆయన వెళ్తుండగా గ్యాస్ కార్యాలయం సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీకొంది. దీంతో ఆయన తలకు తీవ్రగాయమైంది. అప్రమత్తమైన స్థానికులు 108 అంబులెన్స్‌కు సమాచారం అందించగా, అప్పటికే మృతి చెందినట్లు సమాచారం. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని, కేసు నమోదు చేశారు.

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24సి. 10గ్రా.)	60,380-00
బంగారం(22సి. 10గ్రా.)	55,350-00
వెండి (కిలో)	80,000-00

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు	(100 గుడ్లు)
విశాఖపట్నం	రూ. 475.00
విజయనగరం	రూ. 479.00
శ్రీకాకుళం	రూ. 479.00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹138	₹246	₹ 256



మట్టితో గణపతి ప్రతిమల తయారీలో నిమగ్నమైన చిన్నారులు



బహుమతులు గెలిచిన విద్యార్థులతో సాక్షి సిబ్బంది, ముఖ్యఅతిథులు



గెలిచిన బహుమతులతో ఆనందంగా వెళ్తున్న చిన్నారి

చిట్టి చేతుల్లో మట్టి గణపతి

- మట్టి వినాయకుడునే పూజిద్దాం
- పర్యావరణహితంగా వినాయకచవితి
- కాలుష్య నియంత్రణ మండలి పర్యావరణ ఇంజినీరు సరిత
- సాక్షి మీడియా, ఏపీ కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో విద్యార్థులకు మట్టి విగ్రహాలపై అవగాహన
- మట్టి ప్రతిమల తయారీలో ఉత్సాహంగా పాల్గొన్న చిన్నారులు

విజయనగరం రూరల్: 'సాక్షి' మీడియా గ్రూప్, ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి సంయుక్త నిర్వహణలో విజయనగరం ఫోర్టు సిటీ స్కూల్‌లో శనివారం సాగిన 'చిన్నారుల చేతుల్లో మట్టిగణపతి కార్యక్రమం' సందడిగా సాగింది. నిర్వాహకులు అందజేసిన మట్టితో ఆదిదేవుడి ప్రతిమలను చిన్నారులు అందంగా తయారు చేశారు. వాటిని పదేపదే చూస్తూ మురిసిపోయారు. మా మంచి మట్టిగణపయ్య అంటూ చిరునవ్వులు చిందించారు. మట్టిగణపతినే పూజిద్దామన్న సందేశాన్నిచ్చారు. తొలుత కార్యక్రమాన్ని ఫోర్టు సిటీ విద్యా సంస్థల చైర్మన్ కేవీపీ రాజు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం జరిగిన బహుమతి ప్రదానోత్సవానికి కాలుష్య నియంత్రణ మండలి కార్యనిర్వాహక ఇంజినీర్ సరిత ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వినాయక చవితికి, పర్యావరణానికి విడదీయరాని సంబంధం ఉందన్నారు. ఎటువంటి రంగులు పూయని మట్టి విగ్రహాలను పూజించాలని, వీటి వినియోగంపై అవగాహన పెంచుకోవాలన్నారు. విద్యార్థులు వారి తల్లిదండ్రులతో పాటు ప్రతి ఒక్కరికీ పర్యావరణ పరిరక్షణపై, ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే దుష్పరిమాణాలపై అవగాహన కల్పించాలన్నారు. ఫోర్టు సిటీ విద్యా సంస్థల చైర్మన్ కేవీపీ రాజు మాట్లాడుతూ నీటి కాలుష్యం, వాయు కాలుష్యంతో భవిష్యత్తు తరాలు నష్టపోతాయన్నారు. ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలని, కాలుష్య నియంత్రణకు ప్రతిఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలన్నారు. 'సాక్షి' బ్యూరో ఇన్‌చార్జి అల్లు సూరిబాబు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణతోనే భావితరాలకు మేలు కలుగుతుందని, మన పూర్వీకుల సంప్రదాయమైన మట్టి గణపతి విగ్రహాలను పూజించేలా తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. అనంతరం మట్టి గణపతి విగ్రహ తయారీ పోటీల్లో మొదటి బహుమతి కస్పా ఉన్నత పాఠశాల విద్యార్థి సీహెచ్.ఫణిశర్మ, ద్వితీయ బహుమతి ఫోర్టు స్కూల్ విద్యార్థిని కె.షర్మిలారాణి, తృతీయ బహుమతి జొన్నవలస ఉన్నత పాఠశాల విద్యార్థి కె.వి.జ్ఞానేశ్వర్‌లు సాధించారు. కన్సోలేషన్ బహుమతులను ఎం.సంజయ్(పల్లవి విద్యామందిర్), ఎం.హాసిని, జె.జోషిత(ఫోర్టు సిటీ స్కూల్), కె.హిమనేష్(సెయింట్ మేరీ పాఠశాల), ఎస్.మోసే(మలిచర్ల జెడ్పీహెచ్‌ఎస్), పి.విజయ్‌కుమార్(జెడ్పీహెచ్‌ఎస్), ఆర్.నిరంజన్ (శ్రీ చైతన్య)లు ఈఈ సరిత, ఫోర్టు సిటీ స్కూల్ చైర్మన్ కేవీపీ రాజు చేతుల మీదుగా అందుకున్నారు. కార్యక్రమంలో ఫోర్టు సిటీ స్కూల్ ప్రిన్సిపాల్ డాక్టర్ రొహినాఖాన్, డైరెక్టర్ మధు, సాక్షి ప్రకటనల విభాగం మేనేజర్ ఆర్.నగేష్‌లు పాల్గొనగా, న్యాయ నిర్ణేతగా జొన్నవలస జెడ్పీ ఉన్నత పాఠశాల చిత్రలేఖనం ఉపాధ్యాయులు రేజేటి కరుణాకర్, పలు పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పర్యావరణంపై అవగాహన కల్పిస్తా



మట్టి గణపతి విగ్రహాలతో కలుగే ప్రయోజనాలు నా స్నేహితులకు వివరిస్తాను. వారితో పాటు, నా చుట్టుపక్కల వారికి మట్టి గణపతిని పూజించమని చెప్పి పర్యావరణ పరిరక్షణకు ఇప్పటి నుంచే నావంతు కషి చేస్తాను.
– కె.మేధన, 9వ తరగతి, ఫోర్టు సిటీ స్కూల్

మట్టి గణపతిని పూజిస్తాం



నీటి కాలుష్యం నివారించాలంటే మట్టి గణపతినే పూజించి, నిమజ్జనం చేయాలి. ప్లాస్టిక్ నియంత్రణ, రసాయనాలతో కూడిన రంగుల వినియోగం, ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో చేసిన విగ్రహాలతో పర్యావరణానికి కలిగే అనర్థాలపై అందరికీ అవగాహన కల్పిస్తాను.
– కె.హిమనేష్, 6వ తరగతి, సెయింట్ మేరీ స్కూల్

కాలుష్య నియంత్రణే ప్రధానం



పర్యావరణ వినాశానికి కారణమయ్యే కాలుష్యంపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు తన వంతు కృషి చేస్తా. కాలుష్య నియంత్రణకు చేపట్టే అవగాహన కార్యక్రమాల్లో పాల్గొని తోటి విద్యార్థులకు అవగాహన కల్పిస్తా. కాలుష్యనియంత్రణే మనముందున్న లక్ష్యం.
– ఆర్.పవన్, 9వ తరగతి, కస్పా ఉన్నత పాఠశాల

జీవరాశిని కాపాడుతాను



కాలుష్యం బారిన పడకుండా జీవరాశిని రక్షించేందుకు పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరం కృషి చేయాల్సిన అవసరం ఉంది. కాలుష్యానికి కారణమయ్యే ప్లాస్టిక్, ప్లాస్టర్ ఆఫ్ పారిస్, రసాయన రంగుల నియంత్రణపై అందరికీ అవగాహన కల్పిస్తా. మట్టిగణపతి తయారీపై ఇచ్చిన శిక్షణ బాగుంది.
– జ్ఞానేశ్వర్, 10వ తరగతి విద్యార్థి, జెడ్పీహెచ్ఎస్, జొన్నవలస

ప్రకృతిని ప్రేమించాలి



ప్రకృతిని ప్రేమించిన నాడే పర్యావరణాన్ని కాపాడిన వారుమవుతాం. పర్యావరణానికి, జీవ వైవిధ్యానికి మేలు చేసే కార్యక్రమాలపై అవగాహన కల్పించడానికి కృషి చేస్తాను. ప్లాస్టిక్ వినియోగంతో కలిగే నష్టాలను అందరికీ వివరిస్తాను.
– ఎస్.మోసే, 10వ తరగతి విద్యార్థి, జెడ్పీ ఉన్నత పాఠశాల, మలిచర్ల

తల్లిని చంపిన తనయుడికి రిమాండ్

- కన్నతల్లిని క్రూర మృగంలా కడతేర్చాడు
- డీఎస్పీ శ్రీధర్
- నిందితుడికి రిమాండ్



నిందితుడు శ్రీనివాసరావును అరెస్ట్ చేసి వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ శ్రీధర్

రామభద్రపురం: జన్మనిచ్చిన తల్లిని క్రూర మృగంలా కన్నబిడ్డే దారుణంగా హతమార్చాడని డీఎస్పీ పి.శ్రీధర్ తెలిపారు. మద్యం తాగేందుకు డబ్బులు ఇవ్వలేదన్న కోపంతో మండల కేంద్రంలోని వసంతుల వీధిలో ఈ నెల 14వ తేదీ అర్ధరాత్రి కన్నతల్లిని కుమారుడే హత్య చేసిన సంగతి తెలిసిందే. అయితే హత్య చేసిన నిందితుడు రామభద్రపురం వీఆర్వో వద్ద లొంగిపోవడంతో పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించారు. సీఐ తిరుమలరావు, ఎస్ఐలు సురేంద్రనాయుడు, జయంతిలతో కలిసి శనివారం డీఎస్పీ పి.శ్రీధర్ విలేకర్ల సమావేశంలో దీనికి సంబంధించిన వివరాలు వెల్లడించారు. రామభద్రపురం గ్రామం వసంతుల వీధికి చెందిన ఉప్పల రమణమ్మ(75)కు ఆరుగురు సంతానం. వారిలో ఆఖరి సంతానం శ్రీనివాసరావుతో కలిసి ఉంటుంది. శ్రీనివాసరావు రామభద్రపురం జంక్షన్‌లో చిన్న టిఫిన్ కొట్టు పెట్టుకుని జీవనం సాగిస్తూ మద్యానికి బానిసయ్యాడు. టిఫిన్ కొట్టు మీద వచ్చిన డబ్బులు రోజూ తాగేసి ఇంటికి వెళ్లేవాడు. ఆ డబ్బులు చాలక తల్లిని తాగేందుకు డబ్బులు అడుగుతూ రోజూ గొడవ పడేవాడు. తల్లి రోజూ మద్యం తాగొద్దని వారించేది. డబ్బుల్లేక ఇల్లు గడవడం లేదని నచ్చజెప్పేది. దీంతో శ్రీనివాసరావు రోజూ తనను తల్లి మందలిస్తుందని భావించి ఈ నెల 14న దుకాణం తెరవకుండా మద్యం తాగేందుకు రోజూలాగే తల్లిని డబ్బులు అడిగాడు. డబ్బుల్లేవని చెప్పడంతో పింఛన్ డబ్బులు ఇవ్వాలని పట్టుబట్టాడు. అయినా డబ్బులు తల్లి ఇవ్వకపోవడంతో అదే రోజు అర్ధరాత్రి మద్యం తాగి వచ్చి పడుకున్న తల్లిని ఇంట్లో ఉన్న రాడ్డుతో తలపై మోదాడు. దీంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. ఇంకా బతికే ఉందన్న అనుమానంతో రాడ్డు నోటిలో పెట్టి చేతితో తల్లి నాలుక లాగేశాడు. ఆ నాలుకను పేపరులో చుట్టి ప్యాంట్ జేబులో పెట్టి పోలీసులకు చూపాడు. ఎస్ఐ జయంతి దర్యాప్తు చేయగా సీఐ తిరుమలరావు విచారించి కేసు నమోదు చేశారు. నిందితుడు శ్రీనివాసరావును శనివారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

రాష్ట్ర స్థాయి హాకీ పోటీలకు 'ఆశ్రమ' విద్యార్థులు



రాష్ట్ర స్థాయి హాకీ పోటీలకు ఎంపికైన విద్యార్థులు

సీతంపేట: రాష్ట్ర స్థాయి హాకీ క్రీడా పోటీలకు స్థానిక గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు ఎంపికయ్యారు. శ్రీకాకుళంలో శనివారం జరిగిన జిల్లా స్థాయి ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీల్లో 8వ తరగతి చదువుతున్న ఎన్.నవీన్ కుమార్, ఏడో తరగతి చదువుతున్న ఎస్.త్రినాథ్ రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారు. వీరిని పాఠశాల హెచ్‌ఎం టి.చంద్రరావు, డిప్యూటీ వార్డెన్ గానసయ్య, ఉపాధ్యాయ సిబ్బంది అభినందించారు.

రాష్ట్ర అథ్లెటిక్స్ పోటీలకు వంగర విద్యార్థులు



లాంగ్ జంప్ సాధన చేస్తున్న దేవకివాడ అశోక్



స్ప్రింట్ రన్ సాధన చేస్తున్న చందు

వంగర: రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు వంగర జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు ఎంపికయ్యారు. అండర్ – 14 లాంగ్ జంప్ విభాగంలో దేవకివాడ అశోక్, 60 మీటర్ల స్ప్రింట్‌రన్ విభాగంలో కొమరాపు చందు జిల్లా స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారని హెచ్‌ఎం ముద్దాడ రమణమ్మ తెలిపారు. వీరికి ఎన్ఐఎస్ అథ్లెటిక్ కోచ్ నాచు గోవర్ధనరావు, పీఈటీ కవిత పాఠశాల ఆవరణలో ప్రత్యేక శిక్షణ అందిస్తున్నారు.

పెదఖండేపల్లి రోడ్డుకు రూ.2కోట్లు మంజూరు



మంత్రి బూడి ముత్యాలనాయుడు, ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావుకు కృతజ్ఞతలు చెబుతున్న గ్రామస్తులు

- మంత్రి బూడి, ఎమ్మెల్యే కడుబండికి కృతజ్ఞతలు తెలిపిన గ్రామస్తులు

కొత్తవలస: పాలకులు మారారే తప్ప ఆ గ్రామానికి రహదారి మాత్రం వేయలేదు. దశాబ్దాల కాలం పాటూ ఆ గ్రామస్తులు నిత్యం రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడేవారు. దీంతో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఈ రోడ్డు నిర్మాణానికి అడుగులు పడ్డాయి. స్థానిక ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు కృషితో రాష్ట్ర గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి బూడి ముత్యాలనాయుడు రూ.2 కోట్లు మంజూరు చేయడంతో గ్రామస్తులు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు. వివరాల్లోకి వెళ్తే...ఎస్.కోట మండలంలోని అరుకు – విశాఖ రోడ్డులో రాజులకళ్లాల వద్ద జంక్షన్ నుంచి పెదఖండేపల్లికి వెళ్లే రోడ్డు అత్యంత దయనీయమైన పరిస్థితిలో ఉంది. సుమారు మూడు కిలో మీటర్లు రోడ్డులో పెద్ద పెద్ద రాళ్లు తేలిపోయి కనీసం నడిచేందుకు అవకాశం కూడా లేకుండా పోయింది. 1994 సంవత్సరంలో అప్పటి ప్రభుత్వం మెటల్ రోడ్డుగా వేసి చేతులు దులిపేసుకుంది. గ్రామస్తులు తమ అవస్థలను ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో ఈ రోడ్డును బీటీ రోడ్డుగా మారుస్తానని గ్రామస్తులకు ఆయన హామీ ఇచ్చారు. విషయాన్ని రాష్ట్ర పంచాయతీ రాజ్ మంత్రి బూడి ముత్యాలనాయుడికి వివరించి నిధుల మంజూరుకు కృషి చేశారు. రోడ్డును విస్తరిస్తూ బీటీ రోడ్డుగా మార్చేందుకు తక్షణమే రూ.2కోట్లు మంజూరు చేశారు. ప్రస్తుతం ఈ నిర్మాణానికి సంబంధించి టెండర్ ప్రక్రియ పూర్తయింది. త్వరలో పనులు ప్రారంభం కానున్నాయి. రోడ్డు నిర్మాణానికి కృషి చేసిన ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు, నిధులు మంజూరు చేసిన మంత్రి ముత్యాలనాయుడుకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ మేరకు కొత్తవలస మండల కేంద్రంలో గల ఎమ్మెల్యే కాంపు కార్యాలయానికి శనివారం వచ్చిన మంత్రిని, స్థానిక ఎమ్మెల్యేని గ్రామస్తులు ప్రత్యేకంగా కలిసి ఘనంగా సన్మానం చేసి కృతజ్ఞతలను తెలిపారు. కార్యక్రమంలో ఎస్.కోట వైస్ ఎంపీపీ పినిశెట్టి వెంకటరమణ, స్టేట్ డైరెక్టర్ వాకాడ రాంబాబు, మండల పార్టీ అధ్యక్షుడు మోపాడ కుమార్, పుణ్యగిరి ట్రస్టు చైర్మన్ పి.రామకృష్ణ,.పార్టీ నాయకులు రంధి అనంత, సోంబాబు, పెదఖండేపల్లి గ్రామస్తులు ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

20నుంచి ఉక్కు రక్షణ యాత్ర



వాల్‌పోస్టరు విడుదల చేస్తున్న సీపీఎం నాయకులు

విజయనగరం పూల్‌బాగ్: విశాఖ స్టీల్‌ప్లాంట్ రక్షణ కోసం ఈ నెల 20 నుండి 25వరకు శ్రీకాకుళం నుండి విశాఖ స్టీల్‌ప్లాంట్ వరకు ఉక్కు రక్షణ యాత్ర నిర్వహించనున్నట్టు సీపీఎం జిల్లా కార్యదర్శి టి.సూర్యనారాయణ తెలిపారు. స్థానిక ఎల్‌బీజీ భవన్‌లో శనివారం విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా యాత్ర వాల్‌పోస్టరును విడుదల చేశారు. పార్టీ నాయకులు శంకర్రావు, రమణ, వి.లక్ష్మి, పి.శంకర్ పాల్గొన్నారు.

కత్తి చూపించి.. బెదిరించి...

విజయనగరం క్రైమ్: ఉదయం 5 గంటల ప్రాంతంలో ఇంటికి నడుచుకుంటూ వెళ్తున్న వ్యక్తిని అటుగా వస్తున్న ముగ్గురు వ్యక్తులు అడ్డగించి అతని వద్ద డబ్బులు లేకపోయేసరికి అతని వద్ద నున్న సెల్ లాక్కొని పరారయ్యారు. దీనికి సంబంధించి వన్‌టౌన్ పోలీసులు శనివారం అందించిన వివరాలిలా ఉన్నాయి. స్థానిక జీఎస్‌టీయూ గోడౌన్స్ సమీపంలో రాత్రి విధులు నిర్వహించి కెఎల్.పురం వైపు శనివారం వేకువజామున 5 గంటల ప్రాంతంలో ఇంటికి నడుచుకుంటూ వస్తున్న సింగంపల్లి రవి అనే వ్యక్తిని ఆర్‌టీఓ కార్యాలయం సమీపంలో బైక్ పై అటు నుంచి వచ్చిన ముగ్గురు వ్యక్తులు చాకు చూపి బెదిరించారు. అతనివద్ద డబ్బులేవీ దొరక్కపోవడంతో చేతిలో ఉన్న సెల్‌ను లాక్కొన్నారు. బైక్ పై వెళ్లిపోవడానికి ప్రయత్నిస్తున్న వారిని రవి పట్టుకోవడానికి ప్రయత్నం చేశారు. దీంతో అతన్ని ఈ డ్చుకుంటూ వెళ్లిపోయారు. దీంతో అతను తీవ్ర గా యలపాలయ్యాడు. వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బాధితుడు ఫిర్యాదు మేరకు ఎస్ఐ గోపాల్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.